అందరికీ మెరుగైన వైద్యం సీఎం జగన్ లక్ష్యం


జగనన్న కేర్ షీట్ బ్యాగ్‌లను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే గణేష్


శరభవరంలో రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు


జేడీ పేటలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ


చాకిపల్లిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


మంగళాపురంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ


సింగన్నదొరపాలెంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

బుచ్చెయ్యపేట: రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మంగళాపురంలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. అందరికీ మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషిచేస్తున్నారని చెప్పారు. వైద్యులు మౌనిక,కిరణ్‌కుమార్, ఆదిత్యా,పద్మశ్రీ తదితర్లు తమ సిబ్బందితో 431 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు,ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ కంటే పద్మరేఖ వెంకట్, ఎంపీటీసీ అప్పలనరస,తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు పాల్గొన్నారు.

చోడవరం: ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు చాలా ఉపయోగపడుతున్నాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మండలంలో అంకుపాలెంలో సర్పంచ్ నాగులాపల్లి రాంబాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 320 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ డాక్టర్ విభాగం జిల్లా అధ్యక్షుడు బండారు సత్యనారాయణ పర్యవేక్షించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన ధర్మశ్రీ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యరంగాల అభివృద్ధిలో దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ విభాగం కార్యదర్శి దేవరపల్లి రవి, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, తహసీల్దార్ తిరుమలబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, ఈవోపీఆర్డీ చైతన్య, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ మూడెడ్ల మహాలక్ష్మి శంకరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి

నర్సీపట్నం: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి కాపువీధి రామాలయంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలనికోరారు. శిబిరంలో వైద్యులు చాందిని దివ్యశ్రీ, సుధీర్, దివ్య, మల్లికార్జున్‌లు 364 మందికి వైద్య సేవలు అందించారు.మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, కౌన్సిలర్ దాడి రత్నం, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, నాయకులు దాడి బుజ్జి, కిల్లాడ లోవరాజు, యాదగిరి శేషు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, సీడీపీవో మేరీ సువార్త తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో శరభవరంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ దోసపత్ని రాజు, సర్పంచ్ వండల వనిత ప్రారంభించారు. వైద్య నిపుణులు సునీత, శ్రీనివాసరాజు, మౌనిక, బి.వీర్రాజులు 322 మందికి చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ వద్ద బుచ్చింపేట సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ్య చిరుధాన్యాల్లో పోషకాల గురించి వివరించారు.

ముగిసిన వైద్య శిబిరాలు

గత నెల 30న మండలంలో ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు శనివారంతో విజయవంతగా ముగిశాయి. మండలంలో గల 15 సచివాలయాల పరిధిలో షెడ్యూల్ ప్రకారం ఈ శిబిరాలను నిర్వహించారు. కార్పొరేట్‌స్థాయిలో వైద్యసేవలందించారు. ప్రతి శిబిరంలో 300 మందికి పైబడిన రోగులకు చికిత్స చేశారు.

కె.కోటపాడు : సింగన్నదొరపాలెంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్య శిబిరంలో 276 మందికి వైద్య సేవలందించారు. ఈ శిబిరాన్ని పీఏసీఎస్ డైరెక్టర్ నాని, రొంగలి వెంకటరమణ, ఆర్బీకే చైర్మన్ నారపాటి శ్రీరామ్మూర్తి, సర్పంచ్ వెలగల లక్ష్మి, ఎంపీటీసీ రొంగలి లక్ష్మి, లెక్కల సూర్యనారాయణ పరిశీలించారు.చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: పజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు కిముదు రమణమ్మ తెలిపారు. జేడీ పేట ఎంపీయూపీ పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె స్థానిక తహసీల్దార్ పి.వి.రత్నం, వైస్‌ఎంపీపీ రాజారామ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ శిబిరంలో 380 మందికి వైద్యులు కె.మాలంనాయుడు, లలిత, దివ్య వైద్యపరీక్షలు చేశారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ కోశిరెడ్డి కృష్ణమూర్తి, నాయకులు పర్రె రామునాయుడు, జాలంపల్లి చిన్ని పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ప్రజాప్రతినిధులు పరిశీలించారు.

క్లుప్తంగా

గ్రామాల్లో మౌలిక వసతుల మెరుగుకు కృషి


మంగళాపురంలో సచివాలయ భవన ప్రారంభంలో విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: అన్ని గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగు పరుస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మంగళాపురంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో పాలనను గ్రామ స్థాయికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్ కంటే పద్మరేఖ వెంకట్,ఎంపీటీసీ పత్తి అప్పలనరసమ్మ, నాయకులు సయ్యపురెడ్డి ఆనంద్,సీతా బుజ్జి,పినపోలు రామునాయుడు,పెదిరెడ్ల మాణిక్యం,జొన్నాడ శ్రీను,కోవెల శ్రీను తదిత్లు పాల్గొన్నారు.

10 మందికి బీమా నగదు పంపిణీ


బీమా నగదు అందజేస్తున్న సన్యాసిరావు

బుచ్చెయ్యపేట : మృతి చెందిన వడ్డాది పీఏసీఎస్ సభ్య రైతుల కుటుంబ సభ్యులకు పర్సన్ ఇన్‌చార్జ్ దొండా సన్యాసిరావు బీమా నగదు అందజేశారు. సొసైటీ సభ్యులైన 10 మంది రైతులు ఇటీవల మృతి చెందారు. దహన సంస్కారాల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు రూ.4 వేల చొప్పున శనివారం అందజేశారు. సొసైటీ పరిధిలో 59 ఏళ్ల లోపు వయస్సు ఉన్న సభ్య రైతులు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ. 30 వేలు,60 ఏళ్ల పైబడిన వారు మృతి చెందితే రూ. 15 వేల బీమా నగదు అందిస్తామని సన్యాసిరావు తెలిపారు. నాయకులు వీర్ల సురేష్,కార్యదర్శి శాంతి తదితర్లు పాల్గొన్నారు.

ఎస్ఐ లక్ష్మణరావు బాధ్యతల స్వీకరణ



రావికమతం: కొత్తకోట ఎస్ఐగా నియమితులైన జి.లక్ష్మణరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎస్ఐ విభీషణరావుకు నక్కపల్లి బదిలీ కావడంతో అనకాపల్లి డీసీఆర్‌బీలో పనిచేస్తున్న కె.లక్ష్మణరావును ఇక్కడి ఎస్ఐగా నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తి


సూచనలిస్తున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించాలని ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. ఆయన శనివారం అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.6వేలు, మరుగుదొడ్డికి రూ.12వేల చొప్పున ప్రభుత్వం అదనంగా ఇస్తున్న విషయాన్ని ప్రతి లబ్ధిదారుడికి తెలియజేయాలన్నారు. మండల వ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్‌క్లినిక్‌ల భవన నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. మండల వ్యాప్తంగా తాగునీరు సమస్య లేకుండా ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

● మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు టీడీపీ శ్రేణులకు సూచించారు. శనివారం జరిగిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ముఖ్యనాయకులు సమావేశానికి హాజరయ్యారు.

ఆర్‌వోఎఫ్‌ఆర్ లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి


అటవీ, రెవెన్యూశాఖల అధికారులతో సమావేశమైన ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ఆర్‌వోఎఫ్‌ఆర్ లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులకు సూచించారు. ఆర్‌వోఎఫ్‌ఆర్(అటవీ హక్కుల చట్టం) పెండింగ్ దరఖాస్తులపై ఆర్డీవో రెవెన్యూ, అటవీ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా వచ్చిన ఆర్‌వోఎఫ్‌ఆర్ దరఖాస్తులపై ఆరా తీశారు. ఆర్డీవో మాట్లాడుతూ లబ్ధిదారుల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆధారంగా జాయింట్ యాక్షన్ సర్వే చేసి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నవంబర్ 25వ తేదీలోపు లబ్ధిదారులకు హక్కుపట్టాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. త్వరతగతిన ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్డీవో ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో రాజారావు, ఐటీడీఏ ఆర్‌వోఎఫ్‌ఆర్ పర్యవేక్షణాధికారి ఈశ్వరరావు, రేంజర్ లక్ష్మీనర్సు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు


పోలింగ్ బూత్ అధికారులకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: కొత్త ఓటర్ల నమోదుకు నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాసనాయుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పోలింగ్ బూత్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేసే బాధ్యత పోలింగ్ బూత్‌లెవెల్ అధికారులపై ఉందన్నారు. కొత్త ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి పేర్లను తొలగించాలన్నారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఆర్ఐ హరి, కార్యాలయ సినియర్ అసిస్టెంటు డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీరాజు

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు మంచి గుర్తింపు లభించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు అన్నారు. మాడుగులలో వచ్చేనెల 2న జరగనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్రకు పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. చౌడువాడలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఏటుకూరి రాజేష్, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి ఆకుల సాయి ప్రసాద్, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, రాపేటి మల్లునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


దేవరాపల్లిలో వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

నర్సీపట్నం: స్థానిక శాఖ గ్రంథాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి పి.దమయంతి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి జీవిత చరిత్ర గురించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకర్ వివరించారు. రామయణంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు.

దేవరాపల్లి: స్థానిక గ్రంథాలయంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి స్థానిక గ్రంథాలయ అధికారి ఓ. శ్రీనివాసరావు పూలమాల వేశారు. అనంతరం వాల్మీకి జీవిత చరిత్ర గురించి పాఠకులకు వివరించారు.

ప్రారంభమైన తారు రోడ్డు నిర్మాణ పనులు


పనులను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు

రావికమతం: మండలంలో శనివారం బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. చోడవరం మండలం గంధవరం నుంచి రోలుగుంట మండలం వెలంకాయపాలెం వరకూ బీఎన్ రోడ్డు విస్తరణకు రెండేళ్ల కిందటే రూ.104 కోట్లు మంజూరు కాగా, పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో డిసెంబరు లోగా పనులు పూర్తి చేయాలని సదరు కాంట్రాక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. కొన్ని రోజుల పాటు చోడవరం,బుచ్చెయ్యపేట మండలాల్లో పనులు నిర్వహించగా శనివారం నుంచి రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామం నుంచి రావికమతం వైపు తారు రోడ్డు వేసే పనులను ప్రారంభించారు. ఆ పనులను ఎంపీపీ పైల రాజు,డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ,మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు,ముఖ్య నాయకుడు బేతా పాండు తదితర్లు శనివారం పరిశీలించారు.

ప్రభుత్వానికి మంచి పేరుతెచ్చేలా అధికారులు పనిచేయాలి

● ఎంపీపీ సుర్ల రాజేశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

నర్సీపట్నం: ప్రభుత్వానికి పేరు తెచ్చేలా అధికారులు పనిచేయాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం అభివృద్ధి, సంక్షేమంపై అన్ని శాఖల అధికారులతో ఎంపీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా మండలంలో చేపట్టిన, చేపట్టబోతున్న కార్యక్రమాల ను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయమాధవి, కార్యాలయం ఏవో రమణబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


గొప్పులుపాలెంలో వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేస్తున్న సర్పంచ్ భర్త చిన్ని

మాడుగుల రూరల్: మండలంలో జాలంపల్లి పంచాయతీ శివారు గొప్పులుపాలెం గ్రామానికి చెందిన వంతల సన్యాసిరావు ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలను ఆయన కుటుంబానికి శనివారం సర్పంచ్ భర్త గణుతూరి చిన్ని అందజేశారు.మిగిలిన రూ 90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలోకి జమఅవుతుందని వెల్ఫేర్ సహాయకులు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయం మూసివేత


మూతపడిన స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయం

చోడవరం: చంద్రగ్రహణం కారణంగా స్థానిక శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయంతోపాటు అన్ని దేవాలయాలను శనివారం సాయంత్రం 5గంటలకు మూసివేశారు. స్వయంభూగౌరీశ్వరస్వామి, వేంకటేశ్వరస్వామి,కేశవస్వామి,దుర్గాదేవి, చోడవరం, వెంకన్నపాలెంలలో షిర్డీసాయి బాబా తదితర ఆలయాలను మూసివేశారు. ఆదివారం ఉదయం 6గంటలకు సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయ ప్రధానఅర్చకుడు కొడమంచిలి చలపతిరావు తెలిపారు.

చదువుతో బంగారు భవిష్యత్తు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : చదువుతో బంగారు భవిష్యత్తును పొందవచ్చని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ఏపీ సార్వత్రిక విద్యాపీఠం వారు రూపొందించిన దూర విద్య విధానానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, వ్యాపారాల్లో ఉన్న వారు, ఉద్యోగాలు చేస్తున్న వారు చదువు కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దూర విద్య ద్వారా అవకాశాన్ని కల్పిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సార్వత్రిక విద్యాపీఠం స్టేట్ కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, జిల్లా కోఆర్డినేటర్ కుమార్, ఏరియా కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ పాల్గొన్నారు.

అర్హులకు ఉచితంగా న్యాయ సహాయం

అడిషనల్ జిల్లా జడ్జి రత్నకుమార్


మాట్లాడుతున్న అడిషనల్ జిల్లా జడ్జి రత్నకుమార్

కె.కోటపాడు : అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం అందజేయనున్నట్టు చోడవరం 9వ అడిషనల్ జిల్లా జడ్జి కె.రత్నకుమార్ తెలిపారు. మండలంలో కె.కె.అగ్రహారంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలతో పాటు ఏడాదికి రూ.3లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న వారు మండల లీగల్ సర్వీసెస్ కమిటీని సంప్రదిస్తే వారి కేసులను కోర్టులలో వాదించేందుకు లాయర్‌ను ఉచితంగా సమకూర్చనున్నట్టు తెలిపారు.

బాల్య వివాహాలు చేసే వారిపై పోలీసులు తప్పనిసరిగా కేసులు నమోదు చేయాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లతో ఇరువర్గాల వారి అంగీకారంతో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. కె.కె.అగ్రహారం గ్రామం ఇప్పటి వరకూ ఒక్క కేసు లేని గ్రామంగా పోలీసులు తెలిపారని చెప్పారు. మరో రెండు నెలల పాటు ఒక్క కేసు లేకుండా గ్రామం గుర్తింపు పొందితే విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయమూర్తిచే గ్రామంలో సభను నిర్వహించి వివాద రహిత గ్రామంగా ప్రకటించేందుకు చర్యలను తీసుకుంటానని ఆయన తెలిపారు. చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.డేవిడ్ మాట్లాడుతూ ఖాళీ ప్రాంసరీ నోట్లపై సంతకాలు తీసుకోవడం మంచిది కాదని తెలిపారు.

అనకాపల్లి ఆర్డీవో ఎ.జి.చిన్నికృష్ణ మాట్లాడుతూ కె.కె.అగ్రహారంలో సమగ్ర భూసర్వే ద్వారా వివాదాలు ఏమీ లేకుండా సర్వే చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎస్.అరుణశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ, ఎంపీడీవో కె.శచీదేవి, ఎస్ఐ ఆర్.ధనుంజయ్, డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, సర్పంచ్ చల్లా మంగ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

నర్సీపట్నం: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు రెండవ రోజుకు చేరాయి. ఉద్యోగుల పట్ల అధికారుల మొండివైఖరి విడనాడాలని అసోసియేషన్ నాయకులు నారాయణరావు, కేశవరావు డిమాండ్ చేశారు. తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు.

పూజా సామగ్రి, సౌండ్ సిస్టం వితరణ


వెండితో తయారు చేయించిన నక్షత్ర హారతిని అందజేస్తున్న వేమవరపు రమణ దంపతులు


సౌండ్ సిస్టంను అందజేస్తున్న దిమిలి రాము, అయితి శివాజి

రావికమతం: కొత్తకోట దుర్గాదేవి ఆలయం, స్వామి అయ్యప్ప ఆలయానికి గ్రామానికి చెందిన పలువురు భక్తులు రూ.వేల విలువ చేసే పూజా సామగ్రి, సౌండ్ సిస్టంను వితరణగా శనివారం అందజేశారు. వేమవరపు రమణ కుటుంబ సభ్యులు రూ.10 వేల విలువ గల వెండి నక్షత్ర హారతి ప్లేట్‌ను దుర్గాదేవి ఆలయానికి అందజేయగా, స్వామి అయ్యప్ప ఆలయానికి రూ.40 వేల విలువ గల సౌండ్ సిస్టంను ఆ గ్రామానికి చెందిన అయితి శివాజి,దిమిలి రాము దంపతులు అందజేశారు. అదే ఆలయానికి ఉల్లూరి రాజు దంపతులు రూ.17 వేల విలువ గల ఇన్వెర్టర్‌ను అందజేశారు.

ఢిల్లీకి బయలుదేరిన బీజేపీ నాయకులు


మట్టిని ఢిల్లీకి తీసుకువెళుతున్న బీజేపీ నాయకులు

మాడుగుల రూరల్: నా భూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా సేకరించిన మట్టితో స్థానిక బీజేపీ నాయకులు ఢిల్లీకి వెళ్లారు. గ్రామ స్థాయి నుంచి సేకరించిన మట్టిని తీసుకుని శని వారం నాయకులు ఢిల్లీ బయలుదేరినట్టు బీజేపీ మండల అధ్యక్షుడు ఉండూరు రాజు తెలిపారు. నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మేడపురెడ్డి శ్రీనివాసరావు, కె. కోటపాడు మండల ప్రధాన కార్యదర్శి కుమార అప్పారావు, యువమోర్చా అధ్యక్షుడు సబ్బరవపు శివ, దేవరాపల్లి మండల ప్రధానకార్యదర్శి చొప్ప గంగాధర్, మాడుగుల మండల నాయకులు మట్టా కొండబాబు ఢిల్లీ వెళుతున్నట్టు రాజు చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మాడుగుల రూరల్: దేవరాపల్లి మండలం నుంచి చీడికాడ వైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను చీడికాడ తహసీల్దారు బి.వి.రాణి శనివారం చీడికాడలో స్వాధీనం చేసుకున్నారు. ఇసుక తరలింపునకు అనుమతి లేకపోవడంతో స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు అప్పగించినట్టు తహసీల్దార్ తెలిపారు.

వెదురు కర్రలను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్ సీజ్

దేవరాపల్లి: మండలంలోని వాలాబు సమీపంలోని రిజర్వు ఫారెస్టు నుంచి దేవరాపల్లికి అక్రమంగా వెదురు కర్రలను తరలిస్తున్న వ్యాన్‌ను ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్క్వాడ్ డీఎఫ్‌వో ఎం.సోమసుందరం, స్క్వాడ్ రేంజర్ డి.గంగరాజు గురువారం అర్ధరాత్రి పట్టుకున్నారు. ఈ విషయాన్ని స్క్వాడ్ రేంజర్ గంగరాజు శనివారం విలేకరులకు తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు దేవరాపల్లి సమీపంలో మాటు వేశామన్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వచ్చిన వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో 610 వెదురు కర్రలు అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. వ్యాన్‌ను సీజ్ చేశామని, వెదురు కర్రలు కొనుగోలు చేసిన వ్యక్తితో పాటు వ్యాన్ యజమాని, డ్రైవర్‌పై నమోదు చేస్తామని తెలిపారు.